

2లో

కాలభైరవ స్వామి జన్మదిన వేడుకలు ప్రారంభం



# ప్రజాజ్యోతి

## నిజామాబాద్ కామారెడ్డి

సోమవారం 10-11-2025 | పేజీలు : 5



# స్పెషల్ పాలనలో కార్యదర్శులకు ఇక్కట్లు..?

- అప్పుల ఊబిలో పంచాయతీ కార్యదర్శులు..?
- ఖాళీగా గ్రామ పంచాయతీల ఖాతాలు..?
- పత్తాలేని స్పెషల్ ఆఫీసర్లు..?
- పంచాయతీ నిర్వహణకు ఇబ్బందులు
- కార్యదర్శులపై పని భారం..?

రామారెడ్డి, నవంబర్ 09 (ప్రజా జ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ లో సర్పంచుల పదవి కాలం ముగిసిన తర్వాత గత ఫిబ్రవరిలో ప్రత్యేకాధికారుల పాలన మొదలైంది. వివిధ శాఖలకు చెందిన వారిని స్పెషల్ ఆఫీసర్లుగా ప్రభుత్వం నియమించింది. వారిలో కొందరికి గ్రామ పాలనపై ఎలాంటి అవగాహన లేక పంచాయతీల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. వారికి గ్రామ పాలన, నిధుల విషయంలో స్పష్టత లేకపోవడంతో గ్రామ పాలన పడకేసింది. దీంతో గ్రామ పంచాయతీల ఖాతాలు ఖాళీ అయ్యాయి...? కనీసం కరెంట్ ,బిల్లులు ,బోరు ,మరమ్మతులు ,ట్రాక్టర్లకు డీజిల్ కొనలేని పరిస్థితులు జిల్లాలోని కొన్ని గ్రామపంచాయతీ ల లో నెలకొన్నాయి. సర్పంచుల పదవీకాలం ముగియడంతో స్పెషల్ ఆఫీసర్ల చేతుల్లోకి గ్రామ పాలన వెళ్లింది. వారికి




నిధులు, విధులపై స్పష్టత లేక..? రావడం, పోవడం తప్పా ప్రత్యేకాధికారులు చేసిందేమీ లేక కార్యదర్శులకే పని భారమౌతోంది. ఆర్థిక పరమైన సమస్య వచ్చినప్పుడు స్పెషల్ ఆఫీసర్లు చేతులెత్తేయడంతో అప్పులు చేసి మరీ కనీస అవసరాలు తీర్చేందుకు పంచాయతీ కార్యదర్శులు నానా తంటాలు పడుతున్నారు. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి గ్రామ పాలనను కొనసాగిస్తున్నారు. ఇంకా భవిష్యత్తులో మునుముందు ఇంకేం చూడాలో..!?




## న్యాయ సేవలపై విద్యార్థులకు అవగాహన

ఎల్లారెడ్డి, నవంబర్ 9 (ప్రజా జ్యోతి) : హైకోర్టు ఉత్తర్వుల మేరకు జాతీయ న్యాయ సేవల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టు న్యాయ మూర్తి సుష్మా ఆదేశాల మేరకు ఆదివారం ఎల్లారెడ్డి ఎస్సీ సంక్షేమ బాలికల హాస్టల్ లో జాతీయ న్యాయ సేవల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ అవగాహన సదస్సులో అడ్వకేట్ పద్మ పండరి, ఎస్సై బి. మహేష్ మాట్లాడుతూ బాలికలకు చట్టపరమైన హక్కులు, మహిళా రక్షణ చట్టాలు, ఉచిత న్యాయసహాయం పొందే మార్గాలు హెల్ప్‌లైన్ సేవల గురించి వివరించారు. మహిళలపై హింస, గృహహింస, వరకట్న వేధింపుల నివారణ, ఫిర్యాదు విధానాలపై సమగ్రమైన సూచనలు ఇచ్చారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా భయపడకుండా సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కోర్టు టైపిస్ట్ రాజ్ మోహన్, హాస్టల్ వార్డెన్ శారద, పిఎల్వి లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

# కాలభైరవ స్వామి జన్మదిన వేడుకలు ప్రారంభం





రామారెడ్డి, నవంబర్ 09 (ప్రజా జ్యోతి) : రామారెడ్డి మండల కేంద్రంలోని ఇసన్నపల్లి రామారెడ్డి గ్రామాలలో కొలువై ఉన్న ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం, భైరవ స్వామి జన్మదిన వేడుకలు ఆదివారం నుండి ప్రారంభం ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం 6 గంటలకు గణపతి పూజ పుణ్యాహవాచనం, కంకణ ధారణ సంతత ధారాభిషేకం, స్వామివారి కి అభిషేకాలు,మధ్యాహ్నం శ్రీ బద్ది పోచమ్మ అమ్మవారికి బోనాలు అంగరంగ వైభవంగా తీయడం జరిగింది. తదుపరి భక్తులకు అన్నప్రసాదకార్యక్రమాన్నినిర్వహించారు.ఇట్టి కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి ప్రభు రాంచంద్రం దంపతులు స్వామివారికి అభిషేకాలు నిర్వహించి, బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. తదుపరి అమ్మవారి బతిపోచమ్మకు తీర్థ ప్రసాదాలు నైవేద్యాలు అందించి అమ్మవారికి బోనాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహణాధికారి రామచంద్రం, అర్చకులు శ్రీనివాస్ శర్మ , జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, నాగరాజు, భరత్, ఆలయ సిబ్బంది. ఇరు గ్రామాల ప్రజలు ప్రజలు భక్తులు పాల్గొన్నారు.






## పేకాట స్థావరంపై దాడులు..

# నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం

ఎల్లారెడ్డి, నవంబర్ 9 (ప్రజా జ్యోతి) : పేకాట స్థావరంపై దాడులు నిర్వహించిన పోలీసులు నగదు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్న సంఘటన ఎల్లారెడ్డి మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై బొజ్జ మహేష్ తెలిపిన వివరాలు మేరకు.. ఎల్లారెడ్డి మండలంలోని బ్రాహ్మణపల్లి శివారులో ఆదివారం మధ్యాహ్నం సమయంలో కొందరు వ్యక్తులు నగదుతో పేకాట ఆడుతుండగా విశ్వసనీయ సమాచారం మేరకు స్థానిక పోలీసులు దాడులు నిర్వహించారని వివరించారు.ఈ దాడిలో నలుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ. 12,510 నగదు, నాలుగు సెల్‌ఫోన్లను , మూడు బైక్ లు, పేక ముక్కలను స్వాధీనం చేసుకుని నిందితులను పోలీస్ స్టేషన్‌కు తరలించి వ్యక్తులపై కేసు నమోదుచేసినట్లు ఎస్సై వివరించారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## అమరవీరుల పోరాటస్ఫూర్తితో

# రైతాంగ ఉద్యమాలను నిర్మిస్తాం

* **ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య**

నిజామాబాద్ రూరల్: నవంబర్, 9 (ప్రజా జ్యోతి)

భూమికోసం భుక్తి కోసం ఈ దేశం విముక్తి కోసం విప్లవద్యమంలో అమరులైన అమరవీరుల పోరాటస్ఫూర్తితో రైతాంగ ఉద్యమాలు నిర్మిస్తామని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య అన్నారు. సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ డిచ్పల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మెంట్రాజ్ పల్లి గ్రామంలో న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి జెపి గంగాధర్ ఆధ్వర్యంలో అమరవీరుల స్మారక సభను నిర్వహించారు. ఈ సభకు ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య పాల్గొని మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతు కార్మిక వ్యతిరేక విధానాలు చేపడుతున్నాయని దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు మోడీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు ఆదాని అంబానీలకు కట్టబెడుతున్నారన్నారు. దేశ సంపదలో ప్రధాన భాగస్వాములుగా ఉన్న రైతులను కార్మికులను భూముల నుండి పరిశ్రమల నుండి భేదాకలు చేస్తున్నారని ఆయన అన్నారు. దేశ సంపదను కొల్లగొడుతున్న కార్పొరేట్ల సేవలో ప్రధాన మోడీ తరిస్తున్నారన్నారు. రైతుల పంటలకు కేంద్రంలో మద్దతు ధరల చట్టాన్ని తీసుకురావాలని, భారత రైతుల రుణాలను మాఫీ చేసి రుణ విముక్తులను చేయాలని మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు బ్యాంకు ద్వారా తీసుకున్న 13లక్ష కోట్ల అప్పులను మాఫీ చేయించి వారీ మెప్పు పొందారిని అన్నారు. మరొక దిక్కు కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను 4కోడ్లు గా కుదించి కార్మికుల ఉపాధిని కొల్లగొట్టి వారి పనిగంటలను పెంచి శ్రమ దోపిడికి గురి చేస్తున్న కేంద్ర ప్రభుత్వం చర్యలను ఖండించాలని ఆయన అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు పరచడం లేదని అన్నారు. ఆడపిల్లలకు కల్యాణ లక్ష్మి పథకం కింద లక్ష రూపాయలు తులం బంగారం వెంటనే అమలు పరచడం లేదని మహాలక్ష్మి పథకం కింద మహిళలకు నెలకు 2500 రూపాయలు ఇస్తానన్న హామీ అమలు నోచుకోవడం లేదని ఆయన అన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుపరచాలని ఆయన ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. లేనట్లయితే అమరవీరుల పోరాటస్ఫూర్తితో రైతాంగ ఉద్యమాలు నిర్మిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి జెపి గంగాధర్. పి ఓ డబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి మొద్దు సుప్రియ. నాయకులు ఎడ్ల రాణి. గంగాధర్. పెద్దమ్మక్క. మేకల రాజమణి.ఎడ్ల శాంత.ఇందిర. గుర్రపుగోదావరి. ప్రశాంత్. తదితరులు పాల్గొన్నారు.



# మార్క్సిస్టులెనినిస్టు, పీడిత ప్రజల ప్రతిఘటనోద్యమ సిద్ధాంతకర్త

**- నవంబర్ 9న కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి 41 వ వర్ధంతి**

రామారెడ్డి నవంబర్ 09 (ప్రజా జ్యోతి) : ప్రముఖ మార్క్సిస్టు లెనినిస్టు నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రతిఘటనోద్యమ సిద్ధాంతకర్త చంద్ర పుల్లారెడ్డి నవంబరు 9వ తేదీకి అమరుడై 41 సంవత్సరాలు పూర్త అవుతున్నాయి. కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి కర్నూలు జిల్లా వెలుగోడు గ్రామంలో 1917వ సంవత్సరం జనవరి 19వ తేదీన మధ్యతరగతి వ్యవసాయ రైతు కుటుంబంలో జన్మించారు. మార్క్సిజం లెనినిజంమావో ఆలోచనా విధానాన్ని భారతదేశ నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించి విప్లవ మార్గాన్ని రూపొందించునటువంటి నాయకులలో కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి అగ్రగణ్యుడు. ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం పైన సమగ్రమైనటువంటి అవగాహన కలిగినటువంటి కమ్యూనిస్టు అగ్ర నాయకుల్లో ఆయన ఒకరు. కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతం స్వీకరించిన నాటి నుండి మనసా, వాచా, కర్మణా ఈ దేశంలో సోషలిస్ట్ వ్యవస్థ స్థాపనకు కమ్యూనిస్టు పార్టీ నిర్మాణాన్ని చేపట్టినటువంటి కొద్దిమంది ధీరోదాత్త యోధులలో అగ్రగణ్యుడాయన. భారత కమ్యూనిస్టు ఉద్యమ నాయకత్వం రివిజనిజం, నయా రివిజనజానికి గురి అయినప్పుడు మార్క్సిస్టు-శాస్త్రీయ సిద్ధాంతం కోసం నిరంతరము అధ్యయనంతో కూడిన ఆచరణశీలి ఆయన.

*** 1940లో గిండీ ఇంజనీరింగ్ కాలేజీలో..!**

ఇంజనీరింగ్ చదువుతున్నప్పుడు పుచ్చలపల్లి సుందరయ్య తదితరుల పరిచయంతో వామపక్ష, కమ్యూనిస్టు విప్లవ భావాలవైపు ఆకర్షితుడయ్యాడు. జాతీయ ఉద్యమంలో పాల్గొన్నారు. జాతీయ ఉద్యమంలో పాల్గొన్నందుకు ఆరు నెలల పాటు అల్లీపూర్ జైల్లో ఉన్నారు. 1944లో సిపిఐ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. పార్టీ ఆదేశానుసారము నల్లమల అడవులలో గిరిజనుల మధ్యనూ, కర్నూలు సమీప జిల్లా మహబూబ్ నగర్ జిల్లాలోనూ కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం కొరకు పనిచేశారు. తెలంగాణ సాయుధ పోరాటం సాగుతున్న రోజుల్లో ఆ పోరాటానికి ప్రత్యక్ష నాయకత్వం వహించినటువంటి రాష్ట్ర నాయకత్వంలో కామ్రేడ్ పుల్లారెడ్డి ఒకరు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కాలమంతా కమ్యూనిస్టు పార్టీని నిషేధించారు. ఫలితంగా 1949లో అరెస్ట్ కాబడి 1952 వరకు జైల్లో ఉన్నారు. 1952 సంవత్సరంలో అసెంబ్లీ ఎన్నికల ముందు విడుదల అయ్యారు. 1952 సంవత్సరంలో జరిగిన ఉమ్మడి మద్రాస్ శాసనసభ రాష్ట్రఎన్నికలలో నందికొట్కూరు నియోజకవర్గం నుండి కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా గెలుపొందారు. మద్రాస్ శాసన సభ్యుడుగా రాయలసీమ ప్రజా సమస్యలపై ఆరు గంటల పాటు అనర్గళంగా మాట్లాడి ముఖ్యమంత్రి చక్రవర్తుల రాజగోపాల్ చారితో సహా అందర్నీ ఆశ్చర్య చకితులను చేశారు. ఆ తదనంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు కమిటీ





రాయలసీమ సమస్యలపై ఆ కామ్రేడ్ అసెంబ్లీలో చేసిన ప్రసంగాన్ని బుక్ లెట్ గా ప్రచురించింది. తెలంగాణా సాయుధ పోరాటాన్ని విరమించాలని పార్టీ తీసుకున్న ఆదేశాన్ని అనుసరించినప్పటికీ పోరాటాన్ని విరమించడానికి ఆయన వ్యతిరేకి.

*** కమ్యూనిస్టు ఉద్యమానికి..!**

నాయకత్వం వహిస్తున్నటువంటి సోవియట్ రష్యా కమ్యూనిస్టు పార్టీ, స్టాలిన్ మరణానంతరం కృశ్చేవ్ అధికారంలోకి వచ్చాడు. శాంతియుత సహజీవనం, శాంతియుత పరివర్తన, శాంతియుత పోటీ సిద్ధాంతాన్ని ప్రతిపాదించి పెట్టుబడిదారీ విధానము నుంచి సోషలిజానికి శాంతియుతంగా సమాజం పరివర్తన చెందుతుందని ఆయన సిద్ధాంతీకరించాడు. దీనిని వ్యతిరేకిస్తూ అంతర్జాతీయ కమ్యూనిస్టు శిబిరానికి చైనా నాయకుడు మావో సేటుంగ్ నాయకత్వం వహించి 9 వ్యాఖ్యానాలు చేశాడు. ఫలితముగా దీనిని సిపిఐ నాయకత్వం వ్యతిరేకించింది. 1964వ సంవత్సరంలో భారత కమ్యూనిస్టు పార్టీ చీలికకు గురైనప్పుడు ఆయన సిపిఐ (ఎం) వైపు నిలిచారు. 1967వ సంవత్సరం మే నెల 25వ తేదీన పశ్చిమ బెంగాల్ డార్జిలింగ్ జిల్లా, సిలిగురి డివిజన్లో భూమి కొరకు పోరాడుతున్న నక్సల్ బరి గిరిజన రైతాంగ ప్రజలపై రాష్ట్ర కాంగ్రెస్ లో భాగమైన ఒక సెక్షన్తో కూడుకున్న బంగ్లా కాంగ్రెస్తో వామపక్ష మిశ్రమ ప్రభుత్వం పోలీసులు కాల్పులు జరిపి 9 మంది మహిళలను ఒక గిరిజన బాలుడును చంపేశారు. అధికారంలో ఉన్నటువంటి మిశ్రమ ప్రభుత్వం ఈ విధంగా చేయడం అనేది మార్క్సిస్ట్ కమ్యూనిస్టు శ్రేణుల్లో పెద్ద సిద్ధాంత చర్చనీయాంశమైనది. ఈ నక్సల్బరి భూ పోరాటాన్ని బలపరుస్తూ చైనా కమ్యూనిస్టు పార్టీ పెకింగ్ రేడియోలో విస్తృతమైన ప్రచారాన్ని ఇచ్చింది. చైనా పత్రికల్లో భారత భూభాగం పై "వసంతకాల మేఘ గర్జన" అని ఈ పోరాటాన్ని బలపరుస్తూ పతాక శీర్షిక పెట్టి రచించింది. మరొకసారి భారత కమ్యూనిస్టు ఉద్యమంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భారత పాలకవర్గాల వర్గ స్వభావం పైన కమ్యూనిస్టు పార్టీ అనుసరించాల్సిన వ్యూహం, ఎత్తుగడల పైన ఒక పెద్ద సిద్ధాంత చర్చ జరిగింది. సిపిఐ (ఎం) కేంద్ర నాయకత్వాన్ని ప్రశ్నిస్తూ, కామ్రేడ్స్ చంద్ర పుల్లారెడ్డి, కొల్లా వెంకయ్య, దేవులపల్లి వెంకటేశ్వరరావు, తరిమెల నాగిరెడ్డి పార్టీలో సిద్ధాంత చర్చను లేవనెత్తి ప్రత్యామ్నాయ డాక్యుమెంటును ప్రవేశపెట్టారు. 1968 ఫిబ్రవరి నెలలో జరిగిన పాలకొల్లు ప్లీనంలో 231 మంది సభ్యులు హాజరు కాగా 158 మంది వీరిని బలపరిచారు. 52 మంది కేంద్ర డాక్యుమెంట్లను బలపరిచారు. 8 మంది ప్రతినిధులు మాత్రమే తటస్థమయ్యారు. ఇలాంటి ఉన్నతమైన సిద్ధాంత చర్చ, పద్ధతి భారతదేశంలో మరి ఏ రాష్ట్రంలోనూ జరగలేదు. మార్క్సిజం లెనినిజం మావో ఆలోచనా విధానాన్ని భారతదేశ నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించి కార్యకర్తలకు, సభ్యులకు వివరించి చెప్పటంలో కామ్రేడ్ పుల్లారెడ్డిది ఒక ప్రత్యేకమైన వాడి వేడి బాణి. ఆ సందర్భంగా ఆయన వివిధ జిల్లాలు తిరిగి రాష్ట్ర సెక్రెటేరియట్ రూపొందించిన ప్రత్యామ్నాయ డాక్యుమెంటు ను వివరించి చెప్పటంలో ఆయన అందివేసిన చేయి. అదే విధంగా సిపిఐ(ఎం) నాయకత్వంలో జరిగిన ఆలిండియా భర్ద్వాన్ ప్లీనములో ఏడు గంటల పాటు అనర్గళంగా ఆంధ్ర సెక్రెటేరియట్ పెట్టిన డాక్యుమెంట్ను కామ్రేడ్ పుల్లారెడ్డి వివరించి చెప్పాడు.

*** కామ్రేడ్ పుల్లారెడ్డి భారత చైనా సరిహద్దు...!**

సంఘర్షణ సమయంలో 1962 నుండి 1964 వరకు జైల్లో ఉన్నారు. ఆ సందర్భంలో ఆయన మానికొండ సుబ్బారావుతో కలిసి ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం దాని పరిణామాలు అనేటువంటి గొప్ప గ్రంథాన్ని రాశారు. భారత కమ్యూనిస్టులకు కమ్యూనిస్టు ఉద్యమం గురించి తెలుసుకోవటానికి అదొక మార్గదర్శక గ్రంథం. చారు ముజుందార్ తీసుకున్నటువంటి అతివాద దుస్సాహసిక పంథా వ్యక్తిగత హింస వాదాన్ని తిప్పి కొడుతూ ప్రతిఘటన ఉద్యమ పంథాను రూపొందించాడు. మద్రాసు రాష్ట్రంలో తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు తదితరులు అరెస్టయిన తర్వాత ఆంధ్రప్రదేశ్ విప్లవ కారుల కమిటీని ఆయన ఏర్పాటు చేశాడు. నాగిరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు పాటు పుల్లారెడ్డిని కూడా హైదరాబాద్ కుట్ర కేసులో ప్రభుత్వం ఇరికించింది. కామ్రేడ్ పుల్లారెడ్డి ఆ కేసులో అరెస్టు కాలేదు. 1969 నుండి చనిపోయేంతవరకు ఆయన అజ్ఞాతవాసంలోనే పీడిత ప్రజల మధ్య పని చేస్తూనే వచ్చారు. అదేవిధంగా ఆయన అనేక రచనలు చేశారు. ఆయన రచనలన్నిటిని విమోచన సంస్థ వారు ఏడు సంపుటాలుగా ముద్రించారు. భారతదేశంలో ప్రజా యుద్ధపంథాకు సంబంధించి కొన్ని సమస్యలు, ప్రజాయుద్ధ పంథా చైనా యొక్క అనుభవాలు (1970), అతివాద, మితవాద పెడదోరణులకు వ్యతిరేకంగా మావో పోరాటం భారతదేశానికి దాని ప్రాసంగికత (1972), వ్యవసాయక విప్లవము కమ్యూనిస్టుల విప్లవకారుల వైఖరి (1978), భారత దేశంలో ప్రధాన వైరుధ్యము (1979), వ్యవసాయక విప్లవము ఎన్నికలు (1980), ప్రస్తుత పరిస్థితుల్లో మన కర్తవ్యాలు (1980), ఫాసిజాన్ని ఓడించడానికి విప్లవ ఉద్యమ నిర్మాణం గురించి ఆయన 1980లోనే గొప్పగా సిద్ధాంతీకరించాడు. బలమైన విప్లవ పార్టీ లేకుండా విప్లవోద్యమం విజయవంతం కాదు అని ఆయన పదేపదే చెబుతుండేవాడు. మార్క్సిజం లెనినిజం, మావో ఆలోచన విధానం సిద్ధాంతంగా అంగీకరించినటువంటి విప్లవ సంస్థలు, గ్రూపులు అన్నీ కూడా ఏకమై ఐక్యమవ్వాలని బలమైన విప్లవ పార్టీ ఏర్పడాలని ఆయన కృషి చేశారు. ఆ కాలంలోనే సత్యనారాయణ సింగ్ తో ఫణిబక్షి, రామచంద్రన్ కలిసి ఐక్యతా కృషి చేశారు. భారతదేశం పీడిత ప్రజల ఉద్యమాలను ప్రజాపంథా లోనే నిర్మించడంలో ఆయనది ప్రముఖ పాత్ర. కరీంనగర్, అదిలాబాద్, వరంగల్, మెదక్, నిజామాబాద్, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలు, గోదావరి లోయ ప్రాంతమంతా కూడా భూస్వాముల స్వాధీనంలో ఉన్నటువంటి వేలాది ఎకరాల భూమిని గిరిజనులకు భూమిలేని పేద ప్రజల పరమైందంటే కామ్రేడ్ పుల్లారెడ్డి రూపొందించినటువంటి ప్రతిఘటనోద్యమ సిద్ధాంతం వలన గోదావరి లోయ ప్రాంతంలో దాదాపు మూడు లక్షల ఎకరాల భూమి భూమిలేని పేద ప్రజలు సాగు చేసుకుంటున్నారు. సిపిఐ( ఎం) పార్టీ రాష్ట్ర కమిటీ తరపున విద్యార్థి స్టూడెంట్ ఫెడరేషన్ (ఎస్ ఎఫ్) ఫ్యాక్షన్ కు ఆయన బాధ్యత వహించాడు. రాష్ట్ర పార్టీ నుండి విద్యార్థినులకు మార్క్సిస్ట్ చైతన్యాన్ని అందించడంలో ఆయన పాత్ర అద్వితీయమైనది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో పిడి యస్ యు నిర్మాణం చేసి బలమైనటువంటి విప్లవ కార్యకర్తలను విప్లవోద్యమ నిర్మాణానికి అందించాడు. జార్జిరెడ్డి. జంపాల చంద్రశేఖర్. మధుసూదన రాజు. మారోజు వీరన్న. పురుషోత్తమ రాజు, మొదలగు విద్యార్థి అమరవీరులు , పోట్ల రామ నరసయ్య, నీలం రామచంద్రయ్య, శాంతిరాజు, డివి కృష్ణారెడ్డి, బత్తుల వెంకటేశ్వరరావు, రాయల సుభాష్ చంద్రబోసు, పైలా వాసుదేవరావు, సోమాచారి, రాధక్క, రంగవల్లి, జయమ్మ, పైలా చంద్రమ్మ, గద్దం వెంకట్రామయ్య, విక్రమ్, కానూరు వెంకటేశ్వరరావు, కాశీపతి, అరుణోదయ రామారావు మొదలగు అమరవీరులు ఆయన చూపిన పోరుబాటలో నడిచి అమరులు అయిన వారే. దేశంలో కార్మిక వర్గములో పనిచేస్తున్నటువంటి ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్( ఐఎఫ్ టీయు) కూడా ఆయన రూపొందించినటువంటి నిర్మాణ కార్మిక రూపమే.

*** భారతదేశంలో నయా..!**

వలస, నయా భూస్వామ్య విధానం ఉన్నదని కమ్యూనిస్టులో విప్లవకారుల మధ్య పెద్ద చర్చ జరుగుతున్నది. గ్రామాలను విముక్తి చేసి పట్టణాలను చుట్టూ ముట్టేటువంటి కార్మికుల విప్లవోద్యమ కార్యక్రమం 50 సంవత్సరాల నాటిదని, అది నేటి కాలానికి వర్తించదని చెబుతున్నారు. నెహ్రూ గారు ప్రవేశపెట్టిన ఆర్థిక విధానాల స్థానంలో సంక్షేమ రాజ్య భావన వచ్చింది. ఈనాడు సంక్షేమ రాజ్య భావం నుంచి ఉదారవాద భావనతో అమెరికా సామ్రాజ్యవాదం ప్రపంచాన్ని శాసించటానికి ప్రయత్నిస్తున్నది. దాని అడుగుజాడల్లో గత 11 సంవత్సరాల నుండి పరిపాలిస్తున్న ఎన్డీఏ కూటమి నాయకత్వంలోని భారత పాలకులు నయా ఫాసిస్టు రూపం తీసుకొని ఆశ్రితపక్షపాత పెట్టుబడిదారీ విధానం వైపు పరుగులు తీస్తున్నది. భారతీయ జనతా పార్టీ దీర్ఘకాల సాంస్కృతిక చరిత్ర కలిగినటువంటి ఆర్ఎస్ఎస్ యొక్క రాజకీయ విభాగం. దాని లక్ష్యం హిందుత్వ దేశంగా భారతదేశాన్ని రూపొందించడం. అది క్రోనీ కాపిటలిజం తోటి మిలాఖత్ అయినటువంటి పాసిజాన్ని అమలు జరుపుతున్నది. పబ్లిక్ రంగ సంస్థలన్నిటిని అంబానీ ,ఆదానీలకు, టాటా బిర్లాలకు చెప్పుతున్నది. విదేశాంగ విధానంలో అమెరికా సామ్రాజ్యవాదానికి జూనియర్ భాగస్వామిగా ఉన్నది. కాశ్మీరుకు స్వయంప్రతిపత్తినిచ్చే ఆర్టికల్స్ 375 , 35a రద్దు చేయడంతోపాటు, మూడు వ్యవసాయ నల్ల చట్టాలను తీసుకురావడం 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడులను తీసుకురావటం, 8 గంటల పని విధానం రద్దుచేసి 13 గంటల పని విధానాన్ని తీసుకురావడం, భారత రాజ్యాంగ మౌలిక స్వభావం అయినటువంటి సర్వసత్తాక సార్వభౌమా, గణతంత్ర , సామ్యవాద, లౌకిక ప్రజాతంత్ర విధానాన్ని రద్దుచేసి దళితులను మైనారిటీలను స్త్రీలను అమానుషంగా చూసే మనుస్మృతిని భారత రాజ్యాంగంగా రూపొందించాలని ఆర్ఎస్ఎస్ శక్తులు ప్రయత్నిస్తున్నాయి. అడవుల్లో ఉన్నటువంటి మైనింగ్ నిక్షేపాలను పెట్టుబడిదారులకు అప్పజెప్పడానికి , న్యాయ శాసన కార్యనిర్వాహక వ్యవస్థలన్నిటిని నిర్వీర్యం చేస్తున్నారు. అందుకు అనుగుణంగా గిరిజన ప్రజానీకానికి అండగా ఉన్నవిప్లవ కమ్యూనిస్టులపై తీవ్రమైన అణిచివేతకు కగారు లాంటి తీవ్రమైన నిర్బంధకాండను, ఎన్కౌంటర్లో జరుపుతూ మానవ హక్కులను మంటగలుపుతున్నారు. ఇలాంటి మౌలికమైనటువంటి సిద్ధాంతపరమైన విషయాల క్రమంలో నేడు దేశంలో ఫాసిజం జడలు విప్పిన నేటి తరుణంలో కామ్రేడ్ పుల్లారెడ్డి లాంటి నాయకులు సిద్ధాంతకర్తలు లేకపోవడం విప్లవోద్యమానికి తీరనిలోటు. సుదీర్ఘ పీడిత ప్రజా ఉద్యమ కాలంలో ఆరోగ్య సమస్యలు వెంటాడినప్పటికీ ఆయన చూపిన విప్లవోద్యమ దీక్ష, పట్టుదల, నిరాడంబరత, ప్రజా ఉద్యమం, నిర్మాణం చేయడంలో చూపిన చొరవ, ఆచరణలో చూసిన కార్యకర్తలు, అనుభవంలో చూసిన పేద ప్రజానీకం మరువజాలరు. ఉద్యమ నిర్మాణ క్రమంలో కలకత్తాకు రైలులో బయలుదేరిన ఆయన రైలులో ప్రయాణంలో ఉండగానే తీవ్రమైనటువంటి గుండెపోటుకు గురై 1984 నవంబర్ 9వ తేదీన కలకత్తాలో అజ్ఞాతవాసంలో మరణించారు. అజ్ఞాతవాసంలో ఉన్న ఆయన పార్థివ దేహానికి వేలాదిమంది సమక్షంలో అంత్యక్రియలు జరిగాయి. సుదీర్ఘ కాలం విప్లవోద్యమంలో వివిధ బాధ్యతలు నిర్వహించి కడదాకా కమ్యూనిస్టు విప్లవకారుడుగా జీవించిన కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి విప్లవోద్యమ వేగుచుక్క, పీడిత ప్రజా ఉద్యమాలకు మార్గదర్శకుడై ఆదర్శనీయుడై నిలుస్తాడు.

# వృథాగా డబ్బు ఖర్చు పెడుతున్నారా..?

**'నా సంపాదన.. నా ఇష్టం..' అన్నట్లుగా వ్యవహరిస్తుంటారు కొందరు. అవసరం ఉన్నా, లేకపోయినా నచ్చింది కొనేస్తుంటారు.. విలాసాల కోసం ఎక్కువ ఖర్చు చేస్తుంటారు. అయితే సంపాదన ఎంతైనా.. ఖర్చుల విషయంలో మాత్రం ఈ అతి ప్రవర్తన తగదంటున్నారు ఆర్థిక నిపుణులు. ఇలా ఇష్టం వచ్చినట్లు ఖర్చు పెట్టడం అప్పటికప్పుడు సంతోషాన్నిచ్చినా.. భవిష్యత్తులో ఆర్థికంగా పలు సమస్యల్ని తెచ్చిపెట్టే ప్రమాదం ఉందంటున్నారు. అందుకే ఆది నుంచే విలాసవంతమైన కోరికలకు కళ్లెం వేయమంటున్నారు. ఇందుకోసం కొన్ని విషయాలు దృష్టిలో ఉంచుకోవడం తప్పనిసరి అంటున్నారు. అవేంటో తెలుసుకుందాం..**



## ఆలోచనలు అదుపులో..!

చేతి నిండా డబ్బుంటే ఏదో ఒకటి కొనాలనిపిస్తుంటుంది. నిత్యావసరాల కోసం సూపర్‌మార్కెట్‌కు వెళ్లి.. అవసరమైన వాటి కంటే అనవసరమైనవే బాస్కెట్లో వేసేస్తుంటాం. బయటికెళ్లకపోయినా ఆన్‌లైన్లో ఆర్డర్ పెట్టినా అనవసరమైనవి కూడా కొనేసేవాళ్లు ఎంతోమంది!



అవసరం ఉన్నా, లేకపోయినా ఇంట్లో అలా పడుంటాయన్న ఉద్దేశంతో కొన్ని రకాల గృహోపకరణాల కోసం ఎక్కువ మొత్తంలో డబ్బు వెచ్చించే వారూ లేకపోలేదు. అయితే ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే.. వీటిలో మనకు ఉపయోగకరం అనిపించే ఖర్చు ఒక్కటంటే ఒక్కటీ కనిపించదు. అలాంటప్పుడు తెలిసి తెలిసి అనవసరంగా డబ్బు ఖర్చు పెట్టడం ఎందుకంటున్నారు నిపుణులు. కాబట్టి చేతి నిండా డబ్బుందన్న అతి విశ్వాసంతో.. మనసులో తలెత్తే ఇలాంటి ఆలోచనలకు అడ్డుకట్ట వేస్తే.. వృథా ఖర్చుల్ని చాలావరకు తగ్గించచ్చంటున్నారు.

## ఆటో పేమెంట్స్.. ఉత్తమం!

ప్రస్తుతం డబ్బుకు సంబంధించిన లావాదేవీలన్నీ ఆన్‌లైన్లోనే సునాయాసంగా చేసేస్తున్నారు చాలామంది. అయితే కొంతమంది వీటిని తామే స్వయంగా చెల్లించేలా ఆప్షన్ పెట్టుకుంటే.. మరికొంతమంది ఒక నిర్ణీత సమయంలో ఆటో పేమెంట్ అయ్యేలా ఆప్షన్ సెట్ చేసుకుంటారు. డబ్బు విషయంలో వృథా ఖర్చులు చేసే వారికి ఈ రెండో తరహా పద్ధతే ఉత్తమం అంటున్నారు నిపుణులు. ఎందుకంటే నెలనెలా ఒక నిర్ణీత సమయంలో ఆయా చెల్లింపుల కోసం డబ్బు ఆటోమేటిక్‌గా కట్ అయిపోతుందన్న ఆలోచన ఉన్నప్పుడు.. అకౌంట్లో చెల్లింపులకు సరిపడినంత డబ్బును ఉంచేలా వీళ్లు జాగ్రత్తపడతారని.. తద్వారా విచ్చలవిడిగా డబ్బు ఖర్చు పెట్టే పద్ధతికి క్రమంగా కళ్లెం వేయచ్చంటున్నారు.

## 'రీటైల్ థెరపీ'.. వద్దు!

ఒత్తిడి, ఆందోళనలతో సతమతమవుతున్నప్పుడు.. మనం ఏం చేస్తున్నామో మనకే అర్థం కాదు.. ఏదో ఒకటి చేసి ఆ సమస్య నుంచి ఉపశమనం పొందాలనుకుంటాం. ఈ క్రమంలో తమ మనసుకు నచ్చిన పనులు చేయడం చాలామందికి అలవాటు! ఇందులో భాగంగా షాపింగ్ చేసే వారూ లేకపోలేదు. ఇలా షాపింగ్‌తో తమ ఒత్తిళ్లను దూరం చేసుకోవడాన్నే 'రీటైల్ థెరపీ' అంటారు. అయితే ఇదీ ఒక రకమైన వృథా ఖర్చే అంటున్నారు నిపుణులు. అంతేకాదు.. ఈ క్రమంలో మానసిక సంతృప్తి కోసం అనారోగ్యకరమైన ఆహార పదార్థాల్ని కొనుక్కొని తిన్నా.. దాని ప్రభావం ఆరోగ్యంపై పడుతుంది. కాబట్టి మానసిక సమస్యల్ని రీటైల్ థెరపీతో ముడిపెట్టి డబ్బు వృథా చేసుకోకుండా.. దీనికి ప్రత్యామ్నాయ మార్గాల గురించి ఆలోచించడం మేలంటున్నారు.

## 50/30/20 రూల్.. పాటిస్తున్నారా?

డబ్బు సంపాదించడంతోనే సరిపోదు.. ఆర్థికంగా మనకున్న బాధ్యతల్ని సమర్థంగా నిర్వర్తించినప్పుడే భవిష్యత్తులో ఆర్థిక సమస్యలు రాకుండా జాగ్రత్తపడచ్చు. ఈక్రమంలో అనవసరమైన ఖర్చుల్ని అదుపు చేసుకోవడానికి 50/30/20 రూల్ పాటించడం మంచిది అంటున్నారు నిపుణులు. అంటే.. మనకొచ్చిన జీతంలో నుంచి 50 శాతం డబ్బును.. ఇంటి అద్దె/గృహ రుణం, బీమా పథకాలు, ఇతర నెలవారీ చెల్లింపుల కోసం వినియోగించాలి. ఇక నెలనెలా అయ్యే నిత్యావసర ఖర్చుల్నీ ఇందులో నుంచే ఎడ్జస్ట్ చేసుకునేలా ప్రణాళిక వేసుకోవాలి. ఇక 30 శాతం డబ్బును మన వ్యక్తిగత అవసరాలు/ కోరికల కోసం వెచ్చించేలా ప్లాన్ చేసుకోవాలి. ఈ క్రమంలో సినిమాలు, షికార్లు, షాపింగ్, డైనింగ్.. వంటి ఖర్చులన్నీ ఈ మొత్తంలో నుంచి కవరయ్యేలా చూసుకోవాలి. ఇక మిగిలిన 20 శాతం డబ్బును లాభదాయకంగా ఉండే పొదుపు పథకాల్లో పెట్టుబడి పెట్టడం, అందులో నుంచే కొంత మొత్తాన్ని అత్యవసర నిధిగా జమ చేసుకోవడం.. ఇలా నిపుణుల సలహాతో పొదుపుమదుపు చేస్తే.. వృథాగా డబ్బు ఖర్చు పెట్టే సమస్యకు చెక్ పెట్టచ్చు.. భవిష్యత్తులో ఆర్థిక సమస్యలు రాకుండానూ జాగ్రత్తపడచ్చు.

## చిన్న లక్ష్యాలు.. పెద్ద మార్పులు!

ప్రతి ఒక్కరికీ జీవితంలో కొన్ని వ్యక్తిగత లక్ష్యాలుంటాయి. వాటిలో కొన్ని డబ్బుతో ముడిపడి ఉంటాయి. ఈ క్రమంలో దీర్ఘకాలిక లక్ష్యాలు కాకుండా.. స్వల్పకాలిక లక్ష్యాలు సత్ఫలితాలిస్తాయంటున్నారు. ఇల్లు, ఇంటికి కావాల్సిన వస్తువుల కొనుగోలుకు కావాల్సిన డౌన్ పేమెంట్ మొత్తాన్ని సమకూర్చుకోవడం, అత్యవసర నిధి ఏర్పాటుచేసుకోవడం, వెకేషన్ కోసం డబ్బు దాచుకోవడం.. వంటివన్నీ ఈ కోవలోకే వస్తాయి. నిర్ణీత కాలపరిమితి ఉండేలా ఆయా లక్ష్యాల్ని నిర్దేశించుకొని ఒక్కొక్కటి పూర్తిచేస్తూ పోతుంటే.. వృథా ఖర్చులు తగ్గుతాయి.. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. పైగా ఇలాంటి స్వల్పకాలిక లక్ష్యాల్ని పూర్తిచేయడం సులువవుతుంది కూడా అంటున్నారు నిపుణులు!

